## క్లుప్తంగా

### సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఫిరంగిపురం: సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విమాదేవి, డీటీవో రాజా రమేష్ పాల్గొన్నారు.

### ఎయిమ్స్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఎయిమ్స్ ఆసుపత్రి రహదారిలో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. వడ్డేశ్వరం అండర్ పాస్ నుంచి ఎయిమ్స్‌కు వచ్చే రహదారి ఓ ప్రైవేటు నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన పెద్ద ఇనుప రేకు వంగి రోడ్డు పైకి చేరింది. దీంతో అటుగా వస్తున్న వాహనాలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా రేకు రోడ్డుపైకి వంగి ప్రమాదకరంగా ఉన్నా నిత్యం అటుగా తిరిగే ఎయిమ్స్ అధికారులతో పాటు కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వంగిన రేకు తొలగించి సదరు నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఆపద కలగకుండా చూడాలని కోరుతున్నారు.

### ఏఎల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారిగా వినయ్‌కుమార్



గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్లోని ఆంధ్ర లూథరన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఏఎల్) ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారిగా సోషల్ స్టడీస్ విభాగాధిపతి ఎం.వినయ్‌కుమార్‌ను ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల మాట్లాడుతూ సేవాభావంతో సమాజానికి చేతనైన సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ డాక్టర్ అబ్రహం వెస్లీ పాల్గొన్నారు.

### విద్యార్థికి బొమ్మిడాల ట్రస్ట్ ఆర్థిక సాయం



గుంటూరు ఎడ్యుకేషన్: గేట్‌లో జాతీయస్థాయిలో సాధించిన రెండో ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో ఎంటెక్ సీటు పొందిన అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల రవితేజకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి సెమిస్టర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కాకానిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థి రవితేజకు రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు, కొలిశెట్టి సతీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తెనాలిరూరల్: ఆటో రైల్వే వంతెన గడ్డర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలవ్వగా మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం పెరవలి నుంచి సోమవారం తెనాలి వస్తున్న ప్రయాణికుల ఆటో పట్టణ వైకుంఠపురం సమీపంలోని రైల్వే బ్రిడ్జి ఇనుప గడ్డర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెరవలిపాలెంకు చెందిన కంచె సాంబశివరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే ఆటోలో మరో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ అయిన కారణంగా ప్రమాదం జరిగినట్టు ఆటోడ్రైవర్ చెబుతున్నాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాజాలు మోగేది శ్రావణంలోనే!

- ఏప్రిల్ 28 నుంచి నిలచిన శుభకార్యాలు
- వరుసగా శుక్ర, గురు మౌఢ్యమిలు రాక
- ఆగస్టు 7 తరువాతే వివాహాలు, గృహ ప్రవేశాలు

**ఏ కార్యం తలపెట్టినా దానికి మంచి లగ్నం, శుభ ఘడియలు చూసుకోవడం హిందువుల సంప్రదాయం. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలన్నా, పిల్లలకు పెళ్లిళ్లు చేయాలన్నా, నూతన గృహానికి శ్రీకారం చుట్టాలన్నా అందరూ చూసుకునేది ముహూర్త బలమే. రెండు మాసాలుగా అటువంటి ముహూర్తాలకు విరామం లభించింది. మరో నెల పాటు ఆ ముహూర్తాల జాడ(ఆషాఢ మాసం) కానరాదు. రానున్న ఆగస్టు నెలలో వచ్చే శ్రావణ మాసం వస్తే తప్ప అందరి ఇళ్లకు పచ్చటి తోరణాలు, బాజభజంత్రీలు మోగే అవకాశం ఉండదు.**

నెహ్రూనగర్: క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ వరకు నడిచాయి. ఏప్రిల్ 28 నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకు శుక్ర మౌఢ్యమి(మూఢం) నడుస్తోంది. అలాగే మే 7వ తేదీ నుంచి జూన్ ఏడో తేదీ వరకు గురు మౌఢ్యమి. వరసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా శుభకార్యాలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు జూలై 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభమై ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిర్వహించరు. ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి భాజాలు, ఏ ఇతర శుభకార్యాలు జరిగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేష్ల వంటివి చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. అలాగే సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసమే కావడం వల్ల ఆ సమయంలోనూ శుభముహూర్తాలు ఉండవని చెబుతున్నారు.

**శ్రావణ మాసంలోనే..**

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 3వ తేదీ వరకు కొనసాగనుంది.



కల్యాణ మండపంలో డెకరేషన్ చేసిన దృశ్యం

ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. వాటిలో 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్నీ రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

**ఉపాధికి దెబ్బ**

గత రెండు నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవారు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, పూలు, డెకరేషన్ లైటింగ్, కూరగాయలు, కిరాణం, వస్త్ర, బంగారు, వెండి ఆభరణాలు, షామియానాలు, హోటళ్లు, లాడ్జిలతో పాటు సాంస్కృతిక కళాకారులకు పని కరువైంది. మరి ఎంతో మంది రోజు వారీ కూలీలకు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

### శ్రావణం వరకు ఆగాల్సిందే



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు నిలిచిపోయాయి. ఏప్రిల్ నెల చివరి నుంచి వివాహాలకు కొంత కాలం ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకు నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలున్నాయి. మళ్లీ భద్రపద మాసం కూడా శుభకార్యాలు ఉండవు.

– ఏకా సాయి భరద్వాజ్, అర్చకుడు, గుంటూరు

### అన్ సీజన్ వల్ల ఇబ్బందులు



లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్, ఆర్కెస్ట్రా, శుభకార్యాల మీద ఆధారపడి పనిచేసే అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పనులు తప్ప వేరే పనులు చేసుకోలేక ఇళ్లకే పరిమిత మవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో కొన్ని ముహూర్తాలు ఉన్నాయి. అప్పటి వరకు వేచి చూడాల్సిందే.

– మేడా ప్రభుకుమార్, ఫ్లవర్ డెకరేషన్, గుంటూరు

# విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్కే రసూల్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉన్నతంగా ఎదగడానికి సరైన ప్రణాళిక ద్వారా ఇష్టంతో చదవాలన్నారు. మిరియాల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, నైపుణ్యంతో విజయబావుటా ఎగురవేయాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్కే.రసూల్ పాఠశాలలోని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంతాలను రక్షించుకోవాలని ప్రతిరోజు ఉదయం , సాయంత్రం పళ్లను శుభ్రంగా కడుక్కోవాలని, ఆహారం తీసుకున్న తర్వాత నీళ్లతో తప్పనిసరిగా పుక్కిలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, లయన్స్ క్లబ్ సభ్యులు గుప్త, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, డి. శ్రీనివాసరావు, ఇ.శరత్, బి.బుజ్జిబాబు, కె.వెంకటేశ్వరరావు, రమణమ్మ పాల్గొన్నారు.

### ప్రతి సోమవారం ప్రజా సమస్యల స్వీకరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజల నుంచి ప్రతి సోమవారం ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించనున్నామని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అర్జీలను స్వీకరించనున్నామని, మార్చిలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి నిలిపివేసిన స్పందన కార్యక్రమం మళ్లీ ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టర్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు వివరించారు. ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నామని, వివిధ విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

### బొల్లివ్యాధిపై అవగాహన ర్యాలీ



గుంటూరు మెడికల్: ప్రపంచ బొల్లి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ అసోసియేషన్ గుంటూరు, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిసా విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత మాట్లాడుతూ బొల్లి అంటు వ్యాధి కాదని, చర్మంలో మెలనోసైట్ కణాలు తగ్గడం వలన వస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు అన్ని రకాల మందులు, పూత మందులు, ఫొటోథెరపీ చికిత్సలు, సర్జరీలు, లేజర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వ్యాధి మొదలైనప్పుడే చర్మవ్యాధుల వైద్యులను సంప్రదిస్తే పూర్తిగా నివారించవచ్చు అన్నారు. ర్యాలీలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె.సౌజన్య, డాక్టర్ సీతారామ్, డాక్టర్ ఎ.శిరీష, డాక్టర్ టి.వాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ షకీల, డాక్టర్ మన్నెసింధూర, డాక్టర్ నాగేశ్వరమ్మ, డాక్టర్ నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్, పాల్గొన్నారు.

# ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం(పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను విభాగాల వారిగా విభజించి, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని కోరారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 47 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 1, ప్రజారోగ్య విభాగానికి 11, ఉపా సెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

**పూడికతీత పనులపై శ్రద్ధ పెట్టాలి..**

తొలుత నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లు, ఇంటర్నల్ డ్రైన్‌లలో జరుగుతున్న పూడిక తీత పనులను డీఈఈల వారీగా సమీక్షించి, వర్షాలకు నగరంలో ఎక్కడ నీరు నిలబడినా ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యత అని, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులు, నూతన కల్వర్ట్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు 2 రోజుల్లో తీసుకురావాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఎమినిటి కార్యదర్శులు పూడిక తీత పనులను ముందు, తర్వాత ఫొటోలు తీయాలని, కల్వర్ట్‌ల వద్ద పూడిక తీయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాల్వల మీద ఆక్రమణలను పట్టణ ప్రణాళికాధికారులు తొలగించాలని, ప్రజారోగ్య అధికారులు కూడా కాలువల్లో పూడిక, ఆక్రమణలు ఉంటే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వీధి దీపాలకు సంబంధించి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కారం చేయాలని చెప్పారు. తాగునీటి సరఫరా జరిగే సమయంలో తప్పనిసరిగా ప్రతి డివిజన్‌లో శ్యాంపిల్స్ తీసి రిపోర్ట్ అందించాలని ఏఈలను ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి కలుషితం జరిగినా ఏఈలదే బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### పార్కింగ్ పనులు చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పార్కింగ్ పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న పార్కింగ్ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పార్కింగ్ పనులను వేగంగా చేయాలని, అలాగే వర్షం నీరు జీఎంసీ ప్రధాన కార్యాలయం దగ్గర నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్స్ కూడా మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ రమేష్, ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమాల్లో అన్నదానం



అన్నదానం చేస్తున్న రమణయ్య దంపతులు

తెనాలి: మంగళగిరి కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షకుడు ముద్దాభక్తుని రమణయ్య, సమాచార ప్రతినిధి ముద్దాభక్తుని సామ్రాజ్యం దంపతులు వృద్ధులకు అన్నదానం చేశారు. నాజరుపేటలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమం, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో సేవ కార్యాక్రమాలను నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేపట్టారు. ఆయా ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, మురళి, భారతి, షిరిడీ ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, అనూష, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర నగరమే లక్ష్యం

- కాల్వల్లో సిల్ట్ తొలగింపు
- పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



రాజీవ్ గృహకల్ప వద్ద సిల్ట్ తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్(ఎంటీఎంసీ)ని పరిశభ్రత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. సోమవారం మంగళగిరిలోని రాజీవ్ గృహకల్ప రోడ్డు, టిప్పర్ల బజార్‌ల్లోని కాల్వల సిల్ట్ తొలగింపు పనులతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని సచివాలయాల అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి పరిశుభ్రతకు ప్రజలు సహకరించేలా కృషి చేయాలన్నారు. నగరంలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి స్థలాల్లో జంగిల్ క్లియరన్స్ నిర్వహించేలా చూడాలన్నారు. ఇంటి పన్ను తాగునీటి పన్నులు ఎప్పటికప్పుడు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పై అధికారల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి , ఎంపీహెచ్‌వో వెంకటేశ్వరరావు, సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతులకు ఎమ్మెల్సీ మురుగుడు నివాళి



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఎంతో భవిష్యత్తు ఉన్న పడవల బాలసాయి, కొసనం బాలనాగేశ్వరరావు సముద్రంలో కొట్టుకుపోయి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాపట్ల జిల్లా రామాపురం సముద్ర స్నానానికి వెళ్లిన బాలసాయి, బాలనాగేశ్వరరావు సముద్రంలో మునిగి మృతి చెందగా.. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం పట్టణంలోని కొప్పురావుకాలనీలో స్వగృహాలకు తీసుకొచ్చారు. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని మృతదేహాలను సందర్శించి, కన్నీరు పెట్టుకోగా ఆ ప్రాంతమంతా విషాదం నెలకొంది. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో పంటను భద్రపరచుకుని నష్టపోయిన బాధిత రైతుల సమావేశం దుగ్గిరాలలోని రైలుపేటలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్ నందు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పంటను భద్రపరుచుకుని నష్టపోయిన రైతులకు క్వింటాకు రూ.12,500 నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాద సంఘటన జరిగి ఐదు నెలలు దాటుతున్నా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట్రామయ్య, శివ సాంబిరెడ్డి, పసుపు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మంగళగిరి: వర్షాల నేపథ్యంలో దోమలు పెరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బనారాయణ తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలో ప్రభుత్వాసుపత్రి నుంచి మలేరియా యూనిట్ అధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బనారాయణ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో దోమలు పెరగకుండా ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సిబ్బంది ప్రతి రోజు ఇంటింటికి తిరిగి దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దోమల నివారణకు ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణ ద్వారా మలేరియా, డెంగీ నివారించవచ్చన్నారు. ప్రజలంతా సహకరించి తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయాధికారి రాజు నాయక్, ప్రభుత్వాస్పత్రి వైద్యులు గీతా మాధురి, స్నేహరాజు, యూనిట్ మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, సుధీర్, సూపర్ వైజర్లు సాగర్, సైదులు, సిబ్బంది నరసింహారావు, శ్రీనివాసమూర్తి, జాన్‌ఫెన్ని, శివగణేష్, నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా విభాగం ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఓ 84ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలలకు గొడ్డలిపెట్టువంటి జీఓ 84ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో నగర శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు గోవిందు వెలాంగిణిరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అప్‌గ్రేడ్ అయిన 54 ఉన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ 84 జీఓను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ జె.విజయానంద్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 506, 507 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని కోరారు. సీనియర్ నాయకుడు ఎ.రామారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీపీఎస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులుగా సీనియర్ ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు ఓ. నాగార్జున, నగర ప్రధాన కార్యదర్శి కె. గోపి, నగర ఉపాధ్యక్షులు వై.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

### తిరుమలకు పాదయాత్రగా అమరావతి ఉద్యమ మహిళలు

తాడికొండ: ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలని కోరుతూ ఐదేళ్లుగా తాము చేస్తున్న దీక్షలు, ఆందోళనలు ఫలించినందుకు కృతజ్ఞతగా సోమవారం అమరావతి ఉద్యమ మహిళలు తిరుమల పాదయాత్రకు బయలుదేరారు. తుళ్ళూరు మండలం వెంకటపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్ర చేయనున్నట్లు వారు తెలిపారు. వెంకటపాలెం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమరావతి జేఏసీ నాయకుడు పువ్వాడ సుధాకర్ తదితరుల చేతుల మీదుగా పాదయాత్రను ప్రారంభించారు.